క్లుప్తంగా

జీపీ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన



పంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న మండల అధికారులు

బూర్గంపాడు: సోంపల్లి గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి గురువారం తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డిలు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఉపాధిహామీ పథకంలో రూ.20లక్షల గ్రాంటు మంజూరైందన్నారు. గ్రామానికి సమీపంలో ప్రభుత్వ భూమి లేకపోవటంతో గ్రామస్తులు విరాళాలతో 2018లో సేకరించిన 23 కుంటల భూమిలో పంచాయతీ భవనం నిర్మించేందుకు గ్రామస్తులు సహకారమందిస్తామన్నారు. విరాళాలతో కొనుగోలు చేసిన భూమిని గ్రామ అవసరాల కోసం అందించటం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నర్సింహారావు, పంచాయతీ కార్యదర్శి బోరెం సంపత్, పండగ రాములు, దనుగూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై పోస్టర్లు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణ, మానసిక ఒత్తిడిని జయించడానికి సంబంధించిన పోస్టర్లను కళాశాల ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు బానిసలైతే జీవితం అంధకారం అవుతుందని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడిని జయించి చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్, పద్మావతి, హేమలత, శ్రీనివాస్, గరుడాచలం, బాలకృష్ణ, వసుంధర, సుజీత, రత్న, వెంకటనారాయణ, ముత్యం, కోటేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు పట్టణానికి చెందిన కుంజా నరసింహరావు–కరుణకుమారి దంపతులు, వారి కుమార్తె హారికశ్రీలు ఆలయంలోని సాయినాథుడిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం అన్నదాత నరసింహరావు దంపతులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలి

చంద్రుగొండ: పెరిగిన షెడ్యూల్ కులాల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని మాలమహానాడు అశ్వారావుపేట నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దాసరి రామారావు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ ఖమ్మంలో గురువారం నిర్వహించిన అభిప్రాయ సేకరణ ఎదుట రామారావు మాట్లాడారు. రాజ్యాంగంలో కల్పించిన 341 ఆర్టికల్‌ను కొనసాగించాలని కోరారు. మాల, మాదిగల వైరుధ్యాలను ప్రభుత్వం పరిష్కరించాలని చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తలారి నాగరాజు, రాయి రాజా, ఇల్లంగి బాలకృష్ణ, బేతి వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయితీ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ప్రాంతాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ.. రాజకీయ పార్టీల నాయకులు గురువారం మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీఓ.. సమస్యను డీపీఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు పోశం నర్సింహరావు, నాయకులు చెన్నకేశవులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, సీపీఎం నాయకులు సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టం దళారుల పాలు

- చంద్రుగొండలో మూడేళ్లుగా లేని కొనుగోలు కేంద్రం
- పక్క గ్రామానికి 5 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..
- లేదంటే ప్రైవేటు దళారులే దిక్కు..



లారీలో లోడ్ చేస్తున్న దళారులు కొనుగోలు చేసిన ధాన్యం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోవడంతో అన్నదాతల కష్టం దళారుల పాలవుతోంది. ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సేద్యం చేసిన పంటకు గిట్టుబాటు ధర లభించకుండా పోతోంది. ప్రధానంగా చంద్రుగొండలో మూడేళ్లగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం లేదు. ఐదు కిలోమీటర్ల దూరంలోని దామరచర్ల గ్రామంలో గుంపెన సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రం రైతులకు దూరభారంగా మారింది. కోత కోసిన ధాన్యం ఆరబెట్టడంతోపాటు మళ్లీ దామరచర్ల కేంద్రం వద్దకు చేర్చడం ఆర్థికభారంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి మండలకేంద్రంలో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగులు రైతులకు ఉపయోగ పడటం లేదు.

చంద్రుగొండ రెవెన్యూ పరిధిలో అయన్నపాలెం, ఇమ్మడి రామయ్యబంజర్, ఇందిరానగర్ గ్రామాలున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 269 మంది రైతులు 504 ఎకరాల్లో వరి పంట సేద్యం చేశారు. వ్యవసాయ శాఖాధికారుల లెక్కల ప్రకారం 12,600 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రావాల్సి ఉంది. కానీ ఈ దిగుబడి కొనుగోళ్ల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోవడం, దానివల్ల అన్నదాతలకు నష్టాలు చేకూరడం గమనార్హం. వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

సత్వరమే ఏర్పాటు చేయాలి



సత్వరమే ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. కేంద్రం లేకపోవడంతో అన్నదాతలు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. సంబంధిత శాఖాధికారుల సత్వరమే స్పందిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

– నరుకుళ్ల రాము, రైతు, అయన్నపాలెం

దామరచర్లలో సదుపాయాలు లేవు



దామరచర్లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులకు సదుపాయలు లేవు. ధాన్యం వేసుకునేందుకు స్థలం సరిపోవడం లేదు. అధికారులు సత్వరమే స్పందిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

– కీసరి కిరణ్‌రెడ్డి, రైతు, చంద్రుగొండ

ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం



దామరచర్ల కేంద్రానికి ధాన్యం తీసుకెళ్లాలంటే ఆర్థిక భారం అవుతోంది. ట్రాక్టర్ కిరాయితోపాటు ముఠా ఖర్చులు అధికం అవుతున్నాయి. స్థానికంగా కేంద్రం ఉంటే మాకు మేలు జరుగుతుంది. వెంటనే ఏర్పాటు చేయాలి.

– విప్పర్ల పిచ్చయ్య, రైతు, చంద్రుగొండ

రాజకీయ పార్టీలతో సమావేశం



చంద్రుగొండ: రాజకీయ నాయకులతో సమావేశమైన ఎంపీడీఓ అశోక్

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిధిలో ఉన్న పలు పార్టీల నాయకులతో ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పార్టీ నాయకులతో రాబోయే పంచాయతీ ఎన్నికల దృష్ట్యా, ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో ఉన్న పోలింగ్ స్టేషన్ల సంఖ్య, వాటి గూరించి వివరించారు. పార్టీ నాయకులు మండలంలోని పోలింగ్ స్టేషన్లను సరిచూసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ అందించిన వివరాలపై పార్టీ నాయకులు, తమ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రామారావు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: త్వరలో నిర్వహించబోయో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ నాయకులతో ఎంపీడీఓ గురువారం సమావేశం నిర్వహించారు. 14 పంచాయతీల్లో 134 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ బయ్యారపు అశోక్ తెలిపారు. కేంద్రాల ఏర్పాటుపై డ్రాఫ్టింగ్ పబ్లిషింగ్ చేశామన్నారు. కేంద్రాల ఏర్పాటు ప్రక్రియపై ఎలాంటి అభ్యంతరాలూ లేవని రాజకీయ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

మరోవైపు ఇదే అంశంపై అన్నపురెడ్డిపల్లి ఎంపీడీఓ మహాలక్ష్మి మండల కేంద్రంలో రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 16,837 ఓటర్లు ఉండగా 98 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పంచాయతీ ఎన్నికల సజావుగా సాగేందుకు సహకరించాల్సిందిగా పార్టీలను కోరారు. సమావేశంలో నాయకులు వనమా గాంధీ, ఊకే నారాయణ, రాంబాబు, రామారావు పాల్గొన్నారు.

చర్ల: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం దుమ్ముగూడెం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ ఈదయ్య నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో పంచాయతీ ఎన్నికలకు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలపై రాజకీయ నాయకులకు వివరించారు. పలువురు రాజకీయ నాయకులు ఈ విషయంపై సూచనలు చేశారు. సూచనలు స్వీకరించిన అధికారులు వాటిని పరిశీలిస్తామన్నారు.

ఏఈసీఎస్ ఉపాధ్యాయులకు వర్క్‌షాప్



ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వర్క్‌షాప్..

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలోని అణుశక్తి కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయులకు గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులకు విద్యాబోధనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం జీఎం హెచ్.కె.శర్మ, కేంద్ర విద్యాలయ సంఘటన్ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ సాయిరంగారావు, స్వామినారాయణ గురుకుల విద్యాలయం హైదరాబాద్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏఈసీఎస్ ప్రిన్సిపల్ రుక్మాంగధర్‌రావు, హెచ్ఎం.సంతోష్‌భాయే ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో వైద్యశిబిరాలు

మణుగూరురూరల్: మండలంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర పాఠశాల, లంకమల్లారంలో ఉన్న టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ బాలికల వసతి గృహాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, అక్కడి సిబ్బందికి పలు సూచలనలు చేశారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, తడి దుస్తులు ధరించవద్దని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం ఆయన వంటశాలను, స్టాక్ రూమ్‌ను పరిశీలించి వంట వర్కర్లకు పలు సూచనలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సత్తెమ్మ, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, సుమ, ఎంఎల్‌హెచ్‌పీ వినయ్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై రైతుల నిరసన



ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న ధాన్యం రైతులు

అశ్వారావుపేటరూరల్: ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించిన ధాన్యం రాశులను కేంద్రంలో కొనుగోలు చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు గురువారం రోడ్కెక్కి ధర్నా చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నారాయణపురం కాలనీ గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాల్లో పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు స్థానిక సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి కొద్ది రోజుల క్రితం తరలించారు. కాగా, అధికారులు పట్టదారు పాస్‌పుస్తకాలు ఉంటేనే ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. దీంతో ఆగ్రహించిన రైతులు నారాయణపురం కాలనీ వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాదాపు గంటపాటు ధర్నా చేయడంతో వేలేరుపాడు, అశ్వారావుపేట వైపు రాకపోకలు నిలిచిపోగా, ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పందించి.. ఘటన స్థలానికి తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌ను పంపించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో తహసీల్దార్ రైతులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. అనంతరం వ్యవసాయాధికారితో మాట్లాడి..రైతుల వద్ద ఏజెన్సీ కావడంతో పట్టాదారు పాసుపుస్తకాలు లేవని, అయినా సరే ఆయా రైతుల ఆధార్, వ్యవసాయ భూమికి సంబంధించిన ఏదైనా ఆధారం తీసుకుని తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు జక్కుల రాంబాబు, రాయగిరి మల్లేశ్వరరావు, చందా లక్ష్మీనరసయ్య మిండా పెద్ద దుర్గరావు, బల్లం గంగరాజు ఉన్నారు.

పాత లారీ యార్డ్ సమీపానికి ఎస్‌బీఐ

భద్రాచలంటౌన్: బూర్గంపాడు మండలంలోని సారపాకలో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శాఖను మెయిన్ రోడ్ నుంచి కన్నయ్య హోటల్ పక్కన పాత లారీ యార్డ్ సమీపంలోకి ఇటీవల మార్చారు. ఈ మేరకు కొత్త ఖాతాలు జారీ చేయడమే కాక ఖాతాదారులకు ఏటీఎమ్ కార్డులు, చెక్ బుక్కులు జారీచేస్తున్నట్లు శాఖ అధికారులు తెలిపారు. అంతేకాక నిబంధనల మేరకు బంగారం తాకట్టుపై రుణాలే కాక, కార్ల కొనుగోలు, వ్యవసాయానికి రుణాలు ఇస్తున్నట్లు వెల్లడించారు.

మానసిక స్థైర్యం అవసరం

చర్ల: ఎటువంటి ఒత్తిడికీ గురికాకుండా మానసిక ప్రశాంతతో ఉండాలని దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణవేణి విద్యార్థులకు సూచించారు. గురువారం దుమ్ముగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానసిక ధైర్యం కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హెల్ప్ ఆర్గనైజేషన్ వారు అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత కలిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణవేణి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ మల్లెల శ్రీనివాసరావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

అశ్వాపురం: మండల కేంద్రంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పూనెం కోటయ్య తల్లి ఎర్రమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఎర్రమ్మ మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గొల్లపల్లి నరేష్, కెలా శశికాంత్, లోడిగ నరసింహారావు, కలేటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల వితరణ

బూర్గంపాడు: బూర్గంపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని సారపాక సెక్టార్‌లోని శ్రీరాంపురం, భాస్కర్‌నగర్, తాళ్లగొమ్మూరు అంగన్‌వాడీ కేంద్రాలకు కొల్లి ఫౌండేషన్ సహకారంతో 30 కుర్చీలు అందజేశారు. గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ రేవతి చేతుల మీదుగా చిన్నారులు కూర్చునేందుకు కుర్చీలను అందజేశారు. కొల్లి ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ రూప్లా నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సక్కుబాయి, సులోచన, భారతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

17న ‘చలో హైదరాబాద్’

ములకలపల్లి: మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల జనరల్‌బాడీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. జీపీ వర్కర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 17న జరుప తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యదర్శివర్గ సభ్యుడు దొడ్డా రవి, మండల కన్వీనర్ నిమ్మల మధు, తెలంగాణా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు చిక్కుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఉత్పత్తి



మాట్లాడుతున్న మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం కన్వీనర్, ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్

మణుగూరుటౌన్: సింగరేణి సంస్థలోని ఉద్యోగులందరూ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తూ వినియోగదారులకు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం కన్వీనర్, ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్ అన్నారు. గురువారం ఏరియా వ్యాప్తంగా ఈనెల 16వ తేదీ వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మణుగూరు ఓసీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మన సంస్థ, మన గని, మన బాధ్యత అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అంకితభావం, సమష్టి కృషితో పనిచేస్తూ నాణ్యత, రక్షణ కూడిన ఉత్పత్తికి పాటుపడుతూ ఇతర ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలకు ఆదర్శంగా నిలుద్దామని పిలుపునిచ్చారు. పీమో శ్రీనివాసచారి, కమిటీ సభ్యులు డీజీఎం(ఐఈడీ) వెంకట్రావ్ మాట్లాడారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్, డీజీఎం(ఎఫ్అండ్ఏ) అనురాధ, ఏరియా ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, అధికారులు ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ నాయకులు గట్టయ్య, ఓసీ అధికారులు రాజేశ్వర్‌రావు, భాస్కర్‌రావు, శ్రీనివాస్, అవినాష్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికకు సర్వే



మణుగూరురూరల్: వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్

మణుగూరురూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన పేదలకు ఇళ్లను మంజూరు చేసేందుకు మండల అధికారులు గ్రామాల్లో ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. గురువారం కట్టుమల్లారంలో సర్వే కార్యక్రమాన్ని మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, తహసీల్దార్ వి.రాఘవరెడ్డిలు ప్రారంభించి సర్వేను పర్యవేక్షించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకి, సిబ్బందికి సూచించారు. అలాగే మున్సిపాలిటి పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మణుగూరు మున్సిపల్ కమిషనర్ యాదగిరి ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఏఈ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల కేంద్రంలోని చిన తండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను గురువారం ఎంపీడీఓ వరప్రసాద్ ప్రారంభించారు. సర్వేలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారుల వివరాలు సేకరించి యాప్‌లో పొందుపరుస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దాసరి మల్లేశం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గొల్లపల్లి నరేష్, కోలా శశికాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, పంచాయతీ సిబ్బంది గద్దల శివకృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం భూగర్భగని పరిశీలన



గనిలో పరిస్థితిని పరిశీలిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గనిని గురువారం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు, జనరల్ సెక్రటరీ త్యాగరాజన్‌లు సందర్శించారు. కేపీయూజీ మైన్‌లో ఆకస్మికంగా ఉబికి వస్తున్న నీటి వల్ల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడిన నేపథ్యంలో గనిలోకి దిగి పాయింట్‌ను పరిశీలించారు. లక్ష గ్యాలన్ల నీరు గనిలో చేరిందని, ముందస్తు చర్యలుగా మిషనరీలను యాజమాన్యం ఉపరితలానికి తరలించిందన్నారు. అధికారులు నీటిని ఉపరితలానికి పంపేందుకు వినియోగిస్తున్న పంపులను, చేపట్టిన ప్రత్యేక చర్యలు, ప్రకటించిన ఎమర్జన్సీ విషయంలో సంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో బొగ్గు ఉత్పత్తి పునరుద్ధరించే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం కార్మికులనుద్దేశించి వారు మాట్లాడుతూ.. అధికారులు గనిలో బొగ్గు ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. కేపీయూజీ మైన్ కార్మికులు బొగ్గు ఉత్పత్తి కోసం చేస్తున్న కృషిని గుర్తించి టీ, స్నాక్స్ అందించాలని తమ యూనియన్ చేసిన విజ్ఞప్తి మేరకు అందించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గని అధికారులు ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బానోత్ కృష్ణ, పిట్ సెక్రటరీ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేసి ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మల్లాయిగూడెం పంచాయతీ నాగులగుంపు గ్రామంలోని సియోను ప్రార్థనా మందిరంలో గురువారం రాత్రి సెమిక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కొవ్వొత్తుల వెలుగుల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి విశ్వాసులకు పంపిణీ చేశారు. ఈ వేడుకలకు పండువారిగూడెం, దిబ్బగూడెం, రామన్నగూడెం, అల్లిగూడెంతోపాటు పలు గ్రామాల నుంచి విశ్వాసులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సియోను కుమార్, కాకా చంద్రం, నెహ్రూ, దేవదాసు, ఎల్.రాజు, దిలీప్, కే సియోను కుమార్, సంఘం సభ్యులు కిషోర్, ప్రభుదాసు, జైపాల్ పేతురు పాల్గొన్నారు.

బీఎస్పీ అధ్యక్షుడిగా ప్రసాద్

చర్ల: దుమ్ముగూడెం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా పాయం ప్రసాద్‌ను నియమించారు. గురువారం మండల కేంద్రంలో బహుజన సమాజ్‌పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల ఇన్‌చార్జ్ కొప్పుల నారాయణ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసాద్‌ను ఎంపికను పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్ ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ మాట్లాడారు. ఆదివాసీలకు జనాభా ప్రతిపాదికన రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించేందుకు బీఎస్పీ కృషి చేస్తోందని, ఈ క్రమంలోనే పాయం ప్రసాద్‌ను ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్నాక్స్ పంపిణీ

మణుగూరుటౌన్: కొండాపురం భూగర్భగనిలో నీటిని బయటకు పంపించేందుకు పనిచేస్తున్న గని కార్మికులు, అధికారులు, రెస్క్యూ సర్వీస్ బృందాలకు టీబీజీకేఎస్ కార్మికులు తినుబండారాలు అందజేశారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో వారికి అరటిపండ్లు, మ్యాంగో జ్యూస్, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, ఇమ్రాన్ నాయకులు ఉన్నారు.

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు



అశ్వారావుపేటరూరల్: విజేత జట్టుకు జ్ఞాపిక అందిస్తున్న తహసీల్దార్ కృష్ణ ప్రసాద్

అశ్వారావుపేటరూరల్: సీఎం కప్ క్రీడా మండల స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. స్థానిక వ్యవసాయ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో బాలిబాలికలు పాల్గొన్నారు. వాలీబాల్ పోటీల్లో 30 టీంలు , కబడ్డీ 10 టీంలు, ఖోఖో 10 టీంలు పాల్గొన్నాయి. కాగా, ఈ ఫైనల్ పోటీల్లో మండల స్థాయిలో విజేతలుగా నిలిచి, జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన వారిలో బాలుర విభాగం నుంచి ఖోఖో పోటీల్లో 15 మంది, కబాడ్డీ పోటీల్లో 12 మంది, వాలీబాల్ 12 మంది, పరుగు పందెం పోటీల్లో 12 మంది, అథ్లెటిక్స్‌లో 12 మంది, అదే విధంగా బాలికల విభాగంలో ఖోఖో పోటీల్లో 15 మంది, కబాడ్డీ 12 మంది, వాలీబాల్ 12 మంది, పరుగు పందెం పోటీల్లో 13 మంది, అథ్లెటిక్స్‌లో 14 మంది క్రీడాకారులు ఉన్నారు. పోటీల అనంతరం స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జ్ఞాపికలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంఈవో పి.ప్రసాద్‌రావు, ఎస్సై టి.యయాతి రాజు, ఎంపీఓ సోయం ప్రసాద్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన గురుకులంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీలు గురువారం నాటితో ముగిశాయి. పోటీల్లో భాగంగా ఖోఖో, కబడ్డీ, జావెలిన్‌త్రో, లాంగ్ జంప్ తదితర పోటీలను మూడు రోజుల పాటు నిర్వహించారు.

ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ఎంఈఓ కీసర లక్ష్మి మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. విజేతలను ఈ నెల 16న కొత్తగూడెంలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ప్రిన్సిపాల్ వీరాస్వామి, కార్యదర్శులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.